**కథ**

# దీపశిఖ


**ఎం.ఎల్.సూర్యకాంతం**

**మరునాటి శ్రావణమాసం పూజకోసం అన్నీ సిద్ధం చేసుకుంది సునీత. పుట్టినరోజు కూడా ఆరోజున రావడంతో మరీ సంబరంగా అనిపించింది. అమ్మ పంపిన పట్టుచీర కాక మరో చీర తీసుకుంది. సాయంత్రం చేమంతులు తెచ్చుకోవాలనుకుంది. ఇంతలో కాలింగ్ బెల్ మోతతో వెళ్ళి తలుపు తీసింది. ఎదురుగా భర్త భరత్.**

''అరె..అప్పుడే వచ్చేశారే'' అంది ఆశ్చర్యంగా.

''ఏం, త్వరగా రాకూడదా?'' అని ''కళ్ళు మూసుకుని చేతులు చాపు'' అన్నాడు.

అలాగే చేసింది. ''ఈసారి చూడు'' అన్నాక కళ్ళు తెరిచి చూసింది. చేతుల్లో ఒక కవరుంది. గబగబా బయటికి తీసి చూసింది.



అది డిగ్రీ ఎంట్రన్స్ పరీక్షకు దరఖాస్తు.

''ఇదా! బావా..ఇంకా నేను ఏ బంగారు వస్తువో అని ఆశపడ్డాను. మన పెళ్ళయ్యాక నా తొలి పుట్టినరోజు, తొలి నోము కదా'' అంది నిష్ఠూరంగా.

''అదీ ఉంది లేరా..'' అంటూ మరో చిన్న పేకెట్ ఇచ్చాడు.

''మంచి ముత్యం పొదిగిన ఉంగరం''

''చాలా బాగుంది బావా నీ ప్రేమలాగా..నీ మనసులాగా'' అంటూ కళ్ళకద్దుకుంది. ''అవునూ..పెళ్ళికి ముందు నేను ఇంటర్ పూర్తి చెయ్యలేను, నేనిక చదవను, నీ ఆలోచనలతో గడపటమే నాకిష్టం అంటే..'సరే..నీ ఇష్టం. నిన్ను బలవంతపెట్టను' అన్నావు కదా! మరలా ఇప్పుడు డిగ్రీ ఎంట్రన్స్ ఏమిటి బావా? నేను చదవనంతే. రెండేళ్ళ గాప్ తర్వాత మళ్లీ చదువంటే హమ్మో..నా వల్ల కాదు. అయినా నీ సాంగత్యంలో నా చదువెలా సాగుతుందంటావ్?'' అంది కొంటెగా.

''అది కాదు సునీ. నేను ఉదయం వెళ్ళి సాయంత్రం వరకు రానుకదా. ఒంటరిగా ఉండి ఆ టి.వి. ముందు గడిపే బదులు చక్కగా చదువుకో! నువ్వు లోకం పోకడలు తెలీని అమాయకురాలివి. చదువు నీలో పరిపక్వతని కలిగిస్తుంది. నువ్వు అలా ఉంటే నాకు మరీ ఇష్టంగా ఉంటావు. పిచ్చి పిచ్చి ఆలోచనలు రావు'' అన్నాడు గడ్డం పట్టి.

''నీకంత ఇష్టమైతే అలాగే. నీ ప్రేమకోసమైనా చదివి డిగ్రీ పాసవుతాను సరేనా'' అంది ఉద్వేగంగా.

అతని కన్నుల్లో సన్నని కన్నీటి పొర గమనించి ''ఇదేమిటి?'' అంది కంగారుగా.

''ఇంత మంచి మరదలు పిల్ల నా భార్యగా రావటంతో ఆనందబాష్పాలు'' అని నవ్వుతూ ఆమె చెంగుతో కళ్ళు తుడుచుకున్నాడు.

★ ★ ★

ఆరోజు సూట్‌కేసులో బట్టలు సర్దుతూ 'కండోమ్స్' పేకెట్ చూసి..''ఇది ఎందుకు బావా'' అని నిలదీసింది.

''మరి నీ డిగ్రీ పూర్తి కావాలి కదా. పిల్లలు పుడితే ఎలా చదవగలవు డియర్'' అన్నాడు నవ్వుతూ.

ఆ మాటకి చాలా కోపం వచ్చింది సునీతకి. ''అంటే..పిల్లలకన్నా కూడా..నీకు నా డిగ్రీ ముఖ్యమా? నువ్వింత హృదయం లేనివాడివా?'' అంది రోషంగా.

''నీ మేలు కోసమేరా..కన్నమ్మా..అంత కోపం వద్దురా'' అంటూ మైమరిపించేలా మాటలు చెప్పి కోపం తగ్గించాడు.

పట్టుదలగా చదివి డిగ్రీ పూర్తి చేసి 'హమ్మయ్య' అని హాయిగా ఊపిరి పీల్చుకుంది.

★ ★ ★

రోజు రోజుకూ చిక్కిపోతున్న భరత్‌ను చూసి ''డాక్టరుకు చూపించుకోండి'' అని పోరు పెడుతూనే ఉంది సునీత.

''నాకేం..హాయిగానే ఉన్నాను కదా..కాస్త వీక్‌గా ఉంటున్నదంతే. అందుకేగా ఈ పళ్ళు అవి బాగా వాడుతున్నాను'' అని కొట్టిపారేస్తున్నాడు. ఒకటి, రెండు రోజులు సెలవుంటే ఏదో ఒక ప్రదేశానికెళ్ళి జాలీగా తిరిగొస్తున్నారు. సునీతకి అతని ప్రేమ ఎంతో ఆనందాన్నిచ్చేది.

ఎప్పటిలాగే భరత్ కోసం ఎదురు చూస్తుంటే ఆరోజు రెండేళ్ళ వయసున్న ఒక పాపను వెంట బెట్టుకొచ్చాడు. ఉంగరాల జుత్తుతో నలనల్లని కళ్ళతో ముద్దుగా, బొద్దుగా ఉంది. ఆ పాప తాలూకూ ఎవరో అని అతని వెనక చూస్తోంది. అది గమనించి-

''సునీ..ఈ పాప రైల్వేస్టేషన్ దగ్గర రోడ్డు పై ఎండలో నిలబడి ఏడుస్తోంది. ఎవరికి వారే పోతున్నారు. తల్లి ఎవరా..అని చుట్టూ కాసేపు చూశాను. ఎవరూ రాలేదు. తప్పిపోయిందేమోనని రైల్వే పోలీసులకి అప్పగించాను. స్పీకరు ఎనౌన్స్‌మెంట్ చేశారు. ఎవరూ రాలేదు. తల్లిదండ్రులు వచ్చేవరకు మన దగ్గరే ఉంచమన్నారు. సరే అని తీసుకొచ్చా. నీకేమైనా అభ్యంతరమా'' అన్నాడు.

కాసేపు అతని వైపు నిశితంగా చూసింది. స్వచ్ఛమైన అతని మనసు..ప్రేమ ఆమెని పులకింపచేసింది.


''నీకు ఇష్టమై తీసుకు వచ్చావు కదా..నాకూ ఇష్టమే'' అని పాపను తీసుకుని లోనికి నడిచింది.

నెల రోజులైనా ఎవరూ రాలేదు. ''పోలీసులు పేపర్లో కూడా వేయించారట. ఈ పాప కోసం ఎవరూ రాలేదింకా..ఎలాగో..ఏమిటో'' అంటున్నాడు భరత్.

''పోనీలే బావా..మనింట్లోనే ఉంటుంది. నాకు బాగా చేరికయిపోయింది. అమ్మ..అమ్మ అంటుంటే ఎంత ఆనందంగా ఉందో. అసలు ఇలాంటి పిల్లని వాళ్ళెలా పోగొట్టుకున్నారంటావ్'' అంది పాపను హృదయానికి హత్తుకుంటూ. ఆ దృశ్యం అతని కన్నుల్లో కాంతిరేఖలు నింపాయి.

★ ★ ★

భరత్‌కి విపరీతమైన జ్వరం రావటంతో కంగారు పడిపోయింది. స్పృహలేకుండా ఉన్న అతన్ని పక్కింటి వాళ్ళ సహాయంతో హాస్పిటల్‌కి తీసుకు వెళ్ళింది. హాస్పిటల్‌లో జాయిన్ అవ్వాలన్నారు. జాయిన్ చేసి, తల్లిదండ్రులకి ఫోన్ చేసి




చెప్పి, ఫ్లాస్కు, వగైరా తెచ్చుకుందామని ఇంటికి వచ్చింది.

బెడ్‌రూమ్‌లో డ్రెస్సింగ్ టేబుల్‌పై ఎదురుగా కనబడేలా పేపర్‌వెయిట్ పెట్టి ఉంచిన ఒక కవరు కనిపించింది. దానిపై ''డియర్ సునీకి'' అని భరత్ చేతి వ్రాత ఉంది.

కంగారుగా కవరు విప్పింది.

''సునీ! ప్రశాంతంగా కూర్చుని చదువు. కంగారు పడకు. మన పెళ్ళయిన కొత్తలో అంటే మూడు నెలల తర్వాత తరచుగా జ్వరం వచ్చేది గుర్తుందా! మలేరియా అనుకున్నాం. రక్త పరీక్ష చేయించుకున్నాను కదా. అప్పుడు నాకు హెచ్.ఐ.వి. సోకిందని చెప్పారు. ఈ నిజాన్ని నీకెలా చెప్పను. నీ నిండు జీవితాన్ని నాశనం చేశానన్న నా ఆవేదనకు అంతు లేకపోయింది. ఈ ప్రాణాంతక వ్యాధి నీకు కూడా సోకిందేమోనని ఎంతో హడలిపోయాను. నీకు ఫలానా అని చెప్పకుండా నీకు కూడా రక్త పరీక్ష చేయించాను గుర్తుండే ఉంటుంది. నీకు లేదని రిపోర్టు వచ్చింది. నాకెంతో సంతోషమైంది.

అప్పుడే నాకున్న కొద్ది జీవితాన్ని ప్లాన్ చేసుకున్నాను. సునీ! నిజంగా నేను ఏ తప్పూ చేయలేదు. ఒక్కోసారి బద్ధకించి బయట షేవింగ్ చేయించుకునేవాడిని. బహుశా...అదే నా పాలిట శాపమై ఉంటుంది. నీ జీవితాన్ని కూడా బలి తీసుకుంది. ఈ నిజాన్ని నువ్వే కాదు, మా వాళ్ళు, మీ వాళ్ళు కూడా భరించలేరు. అందరికీ ఇప్పుడే చెప్పి బాధ పెట్టేకంటే బ్రతికినన్ని రోజులూ ఆనందంగా గడుపుతూ..నీకు నువ్వు జీవించేలా తీర్చిదిద్దాలనుకున్నాను.

నా మాట విని అలాగే తయారయ్యావు. మనకెలాగూ నా ద్వారా పిల్లలు పుట్టకూడదని, పెంచిన మమకారం ఆ లోటు తీరుస్తుందని, అనాథ పాప దొరికిందని అబద్ధం చెప్పాను. క్షమిస్తావు కదూ! ఇప్పుడు నీ గురించి నాకు చింత లేదు.

సునీ..జీవితం మనం అనుకున్నట్టుగా పాటలాగే సాగిపోదు. ఒక్కోసారి అపశ్రుతులూ ఉంటాయి. వాటిని సవరించుకుంటూ ముందుకు సాగిపోతేనే..మానవ జన్మకు సార్థకత.

అది తెలుసుకున్న నేను చావుని కూడా నవ్వుతూ స్వీకరించగలిగాను. ఎయిడ్స్ వ్యాధి ఉందన్న విషయం నీ సహచర్యంలో మరిచిపోయాను. నీకు తెలియకుండానే తగు జాగ్రత్తలతో మందులు, మంచి ఆహారంతో ఉత్సాహంగా ఉండగలిగాను. ఇంతకాలం దాచానని బాధపడకు.

సునీ..నీకు మా ఆఫీసులోనే జాబ్ ఇస్తారు. అది ఇష్టం లేకుంటే ఏదైనా చిన్న కుటీర పరిశ్రమ చేపట్టినా పదిమందికి ఉపాధి ఇవ్వగలవు. ధైర్యంగా ముందుకు సాగిపోతూ..పాపను తీర్చి దిద్దు. ఇక నేను ఎంతోకాలం బ్రతకను. కనుక చివరి దశలో నువ్వు నవ్వుతూనే కనబడాలి సుమా.

నీ భరత్

★ ★ ★

ధారగా కారే కన్నీళ్ళు తుడుచుకుని గత ఆలోచనల నుండి తేరుకుంది సునీత. భవిష్యత్ లేదని తెలిసి, తనకున్న వ్యాధి చెప్పి గాభరా పెట్టకూడదనుకున్నాడు. గరళం లాంటి నిజాన్ని గుండెల్లో దాచుకుని, నవ్వుతూ..నవ్విస్తూ..భార్య, జీవితాన్ని ఆత్మస్థైర్యంతో గడిపేలా తీర్చిదిద్ది, అనాథ పిల్లను తెచ్చి మాతృప్రేమను కలుగజేసి, కృష్ణపక్ష చంద్రునిలా ఆరోగ్యం క్షీణిస్తున్నా తనకు తానుగా ఆనందంగా గడిపాడు.

ఆ ప్రేమమూర్తి స్ఫూర్తిలేకుంటే తన జీవితం ఎంత అగమ్యగోచరంగా ఉండేదో..ఎయిడ్స్ అనగానే..సమాజంలో బ్రతకలేమనే అధైర్యంతో ముందుగానే ఎంతోమంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. బావలాగా ఎందరు మామూలుగా జీవించగల్గుతున్నారు? అనుకుంది బాధగా. భరత్ చమురున్నంత వరకు వెలిగే 'దీపశిఖ' లాంటి వాడే.

★ ★ ★

''అమ్మగారూ..ప్యాకింగ్ రెడీ'' అంటున్న సుందరమ్మ వైపు సాదరంగా చూస్తూ లేచింది సునీత. సూపర్ బజార్‌లకు, డిపార్ట్‌మెంటల్ స్టోర్స్‌కి అప్పడాలు, వడియాలు, మసాలా పొడులు సప్లై చేసే చిన్న కుటీర పరిశ్రమలో పని చేసే పదిమందీ కూడా ఎయిడ్స్ బాధితులే. అదే అతని ప్రేమకు పంచి ఇచ్చే నిజమైన నివాళి అని ఆమె నమ్మకం.